
# అందమైన భార్య

మల్లాది వెంకట కృష్ణమూర్తి



**చాలామంది** జీవితాల్లో తాము కోరుకునేవి దొరకవు. దొరికేవి వాళ్ళు కోరనివి, నచ్చనివే.

అనేకమంది ఈ అర్థం వచ్చేలా పై వాక్యాన్ని అటు, ఇటు తిప్పినా ఇరవై ఆరేళ్ళ వయసులో కొన్ని వందల సార్లు చెప్పారు. హిందువుగా పుట్టిన ప్రతి వ్యక్తిలో ఈ ఫిలాసఫీ నరనరాల్లో జీర్ణించుకుని పోయి ఉంటుంది కాబట్టి ఇలా ఆలోచిస్తారనిపిస్తుంది ఒకో సారి.

ఈ సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి అయిన వ్యక్తి ఒక్కడే నాకు తారస పడ్డాడు. అతని పేరు బాల గంగాధర తిలక్.

తిలక్ తెలుగువాడె. అప్పట్లో దేశ భక్తులు తమ కొడుకులకి నెహ్రూ, గాంధీ, రాజా రామమోహన్ రాయ్ లాంటి రాజకీయవేత్తల పేర్లు పెట్టే వారు—తమ పుత్ర సంతానం కూడా ఆ ప్రముఖులంత గొప్పవాళ్ళు అవుతారేమోనని. సాధారణంగా ఆ తల్లిదండ్రుల కోరిక నెరవేరలేదనేది గవర్నమెంటు ఆఫీసులో ఎల్. డి. సి. గా పనిచేసే గాంధీనో, మునిసిపల్ మార్కెట్‌లో ఉల్లిపాయల షాపు నడిపే నెహ్రూనో చూస్తే అర్థమవుతుంది.

తిలక్ కూడా ఆ కోవకి చెందినవాడే. గ్రాడ్యుయేట్ అయ్యాక పై చదువు చదువుదామన్నా ఆర్థిక బలం లేక పోవడంతో, నే పనిచేసే బరువులు, తూనికల కార్యాలయంలో యు.డి.సి.గా చేరాడు. చేరి రెండున్నర సంవత్సరాలు దాటాయి.

బాలగంగాధర తిలక్ కోరిక ఒక్కటే. అది—అతను చిన్నప్పటి నించి కలలు కనే లక్ష్యం.

అందరి భార్యలలా కాక, తన భార్య అందమైనదై ఉండాలి. ప్రతి వారు తమ జంటని చూసి అసూయపడేలా ఉండాలి.

అందు కో కారణం ఉంది. తిలక్ తల్లికాని, పిన్నమ్మలుకాని, అక్కచెల్లెళ్ళిద్దరు కాని అందంగా ఉండరు.

"నిజం, బ్రదర్. అసలు మా వంశంలోనే అందమైన ఆడవాళ్ళు లేదంటే నమ్ము." చెప్పాడోసారి.

"ఊహూం. నమ్మను." నవ్వుతూ అన్నాను.

"నిజం. కోడలు నలుపయితే కులమంతా నలుపట. అలాగే కోడలు అందవికారయితే కులమంతా అందవికారులే. మా బామ్మ అసలు బావుండదు."

"మరి మీ తాతయ్య ఎలా చేసుకున్నారు?" అడిగాను.

"మా తాతయ్యకు, బామ్మకు అసలు పెళ్ళి జరిగితేగా?"

"జరగలేదా? అంటే మీ నాన్న గారు అక్రమ సంతానమా?" అదిరి పడ్డాను.

"ఛ. కాదు. పెళ్ళి జరిగింది మా తాతయ్య ఆస్తికి, మా బామ్మ ఆస్తికి. వాళ్ళిద్దరి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా పెళ్ళి చేసేశారు మా ముత్తాతలు. ఆస్తి బయటికి పోకూడదని మేనరికం చేశారు మా తాతయ్యకి." చెప్పాడు.

"నువ్వు ఫర్వాలేదే."

"ఏదో ఉంటాను. నా భార్యని మాత్రం నేనే ఎన్నుకుంటాను. నాకున్న ఏకైక బలహీనత నా భార్య ఎంతో అందమైనదై ఉండాలని కోరుకోవటం.

ఉద్యోగంలో చేరినప్పటి నించి తిలక్ అందమైన అమ్మాయిల వేటలో పడ్డాడు. తిలక్ తన ఏకైక లక్ష్యాన్ని అందరికీ తెలియజేసి, మా ఆఫీసులో పనిచేసే ఉద్యోగస్థులందరి సహాయం కోరాడు.

చాలామంది తమ బంధువులలో పెళ్ళీడు ఉన్న ఆడపిల్లల తల్లిదండ్రులందరికీ తిలక్ గురించి చెప్పారు. దాదాపు ఏభై మందిని చూశాడు. ఏ పిల్లా నచ్చలేదు. ఆ ఏభై మందిలో నలుగురు నిజంగానే బావుంటారు. వాళ్ళూ నచ్చలేదంటే తిలక్ సౌందర్య పిపాస అతిశయోక్తి కాదనిపించింది నాకు.

"ఏమిటి, బ్రదర్, నాకు సరిపడే అందమైన అమ్మాయే లేదా మన తెలుగుదేశంలో!" అంటూండేవాడు తిలక్ ఏ అందమైన వస్తువు చూసినా.

"నీకు తప్పకుండా అందమైన భార్య వచ్చి తీరుతుంది. నీవు కోరిందిమణులా? మాన్యాలా? చాలా చిన్న కోరికేగా!" ఊరడించేవాణ్ణి.

బస్‌స్టాపుల్లో, రైల్వే స్టేషన్‌లో, రోడ్డుమీద సెంటర్లలో తిలక్ తను తిరిగే ప్రతి చోట తనకి సరిపడే భార్య కనబడుతుందేమో అని ఒక కన్ను వేసి ఉంచేవాడు.

మా ఇంటి ఎదురుగా ఖాళీ అయిన ఇంట్లోకి కొత్తగా ఎవరో వచ్చారు. పార్క్‌కి వెళుతూ మా ఇంటికి వచ్చిన తిలక్ ఆనందంగా చెప్పాడు:

"ఒరేయ్ బ్రదరూ బంగారుబొమ్మ లాంటి అమ్మాయి కిటికీలోంచి కనబడిందిరా. మీ ఎదురింట్లో అంత అందమైన అమ్మాయి ఉందని మాట వరసకయినా చెప్పలేదే?"

"వాళ్ళు ఎదురింట్లోకి వచ్చి

మూడే రోజులైంది. నే నంత శ్రద్ధగా చూడలేదు.'' చెప్పాను.

''ఆ అమ్మాయినాకు బాగా నచ్చింది. మధ్యవర్తిత్వం చేసి నువే పుణ్యం కట్టుకోవాలి.''

''మా అమ్మని అడుగు.''

తిలక్ మా అమ్మతో తన గోడు చెప్పుకొన్నాడు. అంతా విన్న చెల్లాయ్ ''ఐస్ క్రీం ఇప్పిస్తే నేను వివరాలు కనుక్కుని చెప్తాను'' అన్నది.

''ఐస్‌క్రీం కాదు. డబుల్ టూటీ ఫ్రూట్ ప్లస్ జేమ్స్ బాండ్ సినిమాకి కూడా డబ్బు లిస్తాను. వివరాలు అర్జెంటుగా కనుక్కో.''

''ష్యూర్. మీ పెళ్ళికి నా కో చీర కూడా పెట్టాలి మరి...'' అడిగింది చెల్లాయ్.

''ఆ అమ్మాయితో నాకు పెళ్ళంటూ జరిగితే పట్టుచీరె పెడతాను,'' చెప్పాడు తిలక్.

మర్నాడు ఉదయం ఎనిమిదిన్నరకి మా ఇంటికి వచ్చాడు. నాతో 'హలో' అని నే చెప్పేది వినిపించుకోకుండా అర్జెంటుగా వంట గదిలోని చెల్లాయ్ దగ్గరకి వెళ్ళిపోయాడు.

అర నిమిషంలో దిగాలు మొహంతో బయటికి వచ్చిన తిలక్‌ని చూస్తే జాలేసింది నాకు.

''ఆ అమ్మాయికి పెళ్ళయిపోయిందట బ్రదర్.'' చెప్పాడు.

''సత్యసాయిబాబా, జిల్లెళ్ళమూడి అమ్మవారు మొదలైన వాళ్ళు వచ్చినప్పుడు భక్తులు కొన్ని వేలలో వస్తారు. అక్కడ ప్రయత్నించు'' ధైర్యంచెప్పాను.

తిలక్ కోరుకునే అందమైన భార్య మా ఎదురింట్లోనే దొరుకుతుందని అప్పుడు నాకు తెలియదు.

• • •

నెల తరవా తనుకుంటాను ఒక రోజు ఉదయం ఆఫీసుకు వెళ్తూంటే ఆ అమ్మాయి ఎదురింటి గుమ్మంలో కనబడింది. పోలికలనిబట్టి ఆ అమ్మాయి పెళ్ళయి పోయిన ఎదురింట్లోని అమ్మాయి చెల్లె లనిపించింది. పద్దెనిమిది ఏళ్ళు సరిగ్గా నిండీ నిండకుండా ఉన్న ఆ అమ్మాయిది సూదంటురాయిలా ఆకర్షించే హోమ్లీ బ్యూటీ.

వెనక్కి వెళ్ళి చెల్లాయితో చెప్పాను.

''ఎదురింట్లో కొత్తమ్మాయి ఉంది. వివరాలు కనుక్కో. ఖచ్చితంగా పెళ్ళి అయివుండదు. మన తిలక్‌కి నచ్చుతుంది.''

సంగతి తెలియగానే గంట పర్మిషన్ తీసుకున్నాడు తిలక్ వాడికి, నాకు. నాలుగున్నర రకి మా ఇంటికి చేరుకున్నాం. పండగకి చక్కెర కోటా వస్తే రేషన్ షాపుకి పరిగెత్తే వాళ్ళకుండే ఉత్సాహం కాదది. ఆ అమ్మాయిని చూడాలని తిలక్‌లో అంతకు లక్ష రెట్లు ఉత్సాహం ఉంది.

• • •

తిలక్ ఒక మాదిరిగా ఉంటాడు.

వాసవి—అంటే ఆ అమ్మాయి, తిలక్‌కి నచ్చిందంటే చాలా అందమైన అమ్మాయి కిందే లెక్క. ఆ సంగతి అంతా ఒప్పుకున్నారు. ఆ అమ్మాయి తిలక్‌ని చేసుకోడానికి ఇష్ట పడుతుం దనుకోలేదు నేను.

చక్కటి కంఠం. ఎటునించిచూచినా అందం ఒలికిపోతుంటుంది వాసవిలో.

మధ్యతరగతి వాళ్ళు కాబట్టి, కట్నం ఇచ్చుకోలేరు కాబట్టి వాసవి తనని కోరుకున్న వాడిని చేసుకోవడానికి ఆట్టే ఆలోచించకుండా అంగీకరించింది.

మాఘమాసంలో వా రిద్దరివివాహం జరిగిపోయింది. బ్రహ్మచారి గది ఖాళీ చేసి వేరే ఇల్లు అద్దెకు తీసుకున్నాడు తిలక్.

వారి వివాహానికి వచ్చిన తిలక్ బంధువులలోని ఆడవాళ్ళని చూశాక, అందమైన అమ్మాయినే భార్యగా చేసుకోవాలనే కోరిక తిలక్‌లో అంత బలంగా ఎందుకు నాటుకుందో అర్థమైంది నాకు.

ఆ ఆడవాళ్ళలో కొందరు వాసవిని చూసి అసూయపడితే, కొందరుముచ్చటపడ్డారు.


పెళ్ళికి ముందే తిలక్ చెల్లాయిని, నన్ను వాసవిని తీసుకుని సినిమాకి వెళ్ళాడు ఒక రోజు. హిందీ సినిమా కాబట్టి బొబ్బర్లంకలో పుట్టి పెరిగిన వాసవికి అది అర్థం కాకపోగా తలనొప్పి వచ్చింది.

ఆ అమ్మాయి ఇక కూర్చోలేకపోతే సగంలో బయటికి వచ్చేశాం. మా అందరికీ ఐస్‌క్రీం ఇప్పించాడు తిలక్. మర్నాడు వాసవికి జలుబు చేసేసింది.

''థాంక్యూ, బ్రదర్. ఈ జన్మలో నాకు పెళ్ళి గీత లేదనుకున్నాను. అంతా నువ్వే మాట్లాడి సెటిల్ చేశావ్.'' చెప్పాడు తిలక్ పెళ్ళయిన వారం రోజుల తర్వాత రైల్వే స్టేషన్‌లో.

''నాదేం లేదు. అంతా మా అమ్మే మాట్లాడింది.''

''బెంగుళూరులో దంతంతో చేసిన పెన్ తీసుకురండి నాకు. చీర పెట్టక్కర్లేదు. అది చాలు. నవలలు రాయా



# ఓ ఓ బి బ్లూ డిటర్జెంట్ పౌడరు చాలా తక్కువ ఖర్చుతో మీ బట్టలకొక ప్రత్యేక చలవ ఇవ్వడానికి-

ఓ ఓ బి బ్లూ డిటర్జెంటు వాషింగు పౌడరు నురుగులో తెల్లదనం ఇచ్చే ఓ ప్రత్యేక పదార్థమున్నది. తళతళలాడే మీ బట్టల తెల్లదనానికి, లాండ్రీ వుతుకులాంటి కొత్తదనానికి, మరియు మీ బట్టల సురక్షితానికి, ఈ ప్రత్యేక పదార్థమే కారణము.—

ఆల్ట్రా మెరైన్ అండ్ పిగ్‌మెంట్సు లిమిటెడ్
రాణిపేట,
తమిళనాడు




కేవలము బట్టకి నాలుగు పైసలే!

# ఓ ఓ బి బ్లూ డిటర్జెంట్ పౌడరు

Sista's-UPL-82 A 81.Tel


లమకుంటున్నాను.'' చెప్పింది చెల్లాయి.

బెంగుళూరు, మైసూరు, వూటీ ఇరవై రోజుల హనీమూన్‌కి వెళ్ళారు వాసవి, తిలక్.

తిలక్ పెళ్ళయ్యాక దాదాపు పది రోజుల దాకా స్టాఫ్ అతని గురించే మాట్లాడారు. అతని అదృష్టానికి ఈర్ష్య పడ్డారు కూడా.

చక్కటి లైఫ్ పార్ట్‌నర్ దొరకటం అదృష్టంతోనే ముడిపెట్టి ఉంటుందిగా మరి!

• • •

తిలక్ పెళ్ళయి ఎనిమిది నెలలు గడిచాయి. తిలక్‌లో ఈ ఎనిమిది నెలలలో వూహించలేనంత మార్పు. నేనే కాదు, ఆఫీస్ స్టాఫ్ అంతా గమనిస్తున్నారు. ఇదివరకు హుషారుగా లేడు. ఉదాసీనత, పరధ్యానం, మతిమరుపు ఎక్కువయ్యాయి.

మాట్లాడినా ఇదివరలో లేని ఒక కొత్త గుణం—జోకులు వేసి తోటి వాళ్ళని నవ్వించడం. రోజుకో ఇరవై జోకులైనా వేస్తుంటాడు.

తిలక్ జీవితంలోకి విషాదం ప్రవేశించిందని గ్రహించాను. దాన్ని దూరం చేసుకోడానికి అతని ప్రవర్తన అలా మారిందనిపించింది నాకు.

రెండు మూడు సార్లు అడిగాను:

''ఎలా ఉంది నీ జీవితం?''

''జీతం లాగా ఎదుగు, బొదుగు లేకుండా ఉంది.''

''వాసవికి కొత్త కదా. పైగా చిన్న పిల్ల. నీ మాటలకి ఎదురు తిరిగి నిన్నేమైనా బాధ పెడుతూందా?''

''అలాంటిదేం లేదు. ఐ యామ్ హాపీ నౌ. షి ఈజ ఏ చార్మింగ్ యంగ్ లేడీ. కాకపోతే...''

''ఆగావే?''

''ఏం లేదు.''

తిలక్‌ని తరచి తరచి అడగలేదు నేను. ఇతరుల మనసుల్లోని రహస్యాలు, జీవితాల్లోని బాధలు తెలుసుకోవడం వల్ల వాళ్ళకి దూరం అయే అవకాశం అధికంగా ఉంటుంది. 'నా సంగతులన్నీ తెలిసిపోయాయి కాబట్టి వాడు నన్ను చిన్నచూపు చూస్తున్నాడు' అనే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ కలిగే మనస్తత్వం తిలక్‌ది. అందుకే అతని సంసారంలోని కొన్ని విషయాల గురించి తెలుసుకోదలుచుకోలేదు.

అప్పుడప్పుడు వాళ్ళిద్దరు మా ఇంటికి వస్తున్నారు, ఎదురింటికి వచ్చినప్పుడల్లా. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారనేది చూడగానే తెలిసిపోతుంది.

కాని అంతలో అకారణంగా తిలక్ మొహం ముడుచుకోవటం నా కన్నా ముందు మా అమ్మ గమనించి చెప్పింది.

అమ్మ చేసి ఇచ్చిన ఉప్మా తింటూ ఏదోలా మొహం పెడతాడు. ఇంటికి తిరిగి వెళ్ళడానికి ఆటో ఎక్కుతుంటే మొహం కందగడ్డలా చేసుకుంటాడు.

''ఏమా తిలక్ ఎందుకు తనలో తనే మథన పడుతున్నాడు. కాస్త కనుక్కోకూడదూ?'' చెప్పింది అమ్మ.

''నిజమే. అడిగితే ఏం చెప్పటం లేదు. బహుశా తెలిసీ మనం ఏం చేయలేం అనేమో?''

''వాళ్ళక్కయ్యకి ఏమైనా చెప్పిందేమో! నువు కనుక్కోవే. ఇద్దరూ చిన్నవాళ్ళు. ఏం బాధలు పడుతున్నారో!'' అమ్మ చెల్లాయితో చెప్పింది.

వాసవి అక్కయ్య మరునాడు మా ఇంటికి వచ్చి అమ్మతో చెప్పింది:

''అదేం చెప్పదు. అతన్ని అడిగే చనువు లేదు నాకు. మా వారినీ కనుక్కోమంటే ససేమిరా అంటున్నారు. అసలు వాళ్ళిద్దరిమధ్య ఏం మనఃస్పర్థలున్నాయో మీరే కనుక్కోండి, మామ్మగారూ.''

వారం తరవాత అమ్మ వాసవిని పక్కకి పిలిచి అడిగింది:

''మీ వారేమిటి ఈ మధ్య అదోలా ఉంటున్నారు?''

''ఆయనకి నే నేమాత్రం నచ్చలేదు.'' కన్నీళ్ళతో చెప్పింది వాసవి.

పక్క గదిలోంచి వింటూన్న నేను నమ్మలేదు వాసవి మాటలు. అందానికి నిర్వచనం అయిన వాసవి నచ్చక పోవటమా? అసాధ్యం.

''కోరి నిన్నే చేసుకున్నాడు.'' అడిగింది అమ్మ.

''ఏమో మరి?'' వెక్కి వెక్కి ఏడ్చింది వాసవి.

ఆదివారం తిలక్‌ని పార్క్‌కు తీసుకెళ్ళి కూర్చోపెట్టి అడిగాను మాటిగా:

''వాసవని ఎందు కేడిపిస్తున్నావో తెలుసుకోవచ్చా?''

నా కళ్ళలోకి బిత్తర పోతూనే చూశాడు కొన్ని క్షణాలు.

''ఎప్పుడు చెప్పింది?'' అడిగాడు.

''కొన్ని సంగతులు చెప్పకనే నువే చెప్పేసావ్. నా కొక్కడికే కాదు, నాకు తెలిసిన చాలా మందికి. కొన్ని గుసగుసలు కూడా బయలు దేరాయి. అఫ్‌కోర్స్ అలా జరిగి ఉండదనే నా నమ్మకం.''

''ఏంటా గుసగుసలు? భార్యా రూపవతీ... ఆ సామెతా?''

''అదీ క్లీన్ నువు ఇంకెవరినో తగులుకున్నావని. ఇంకో గుసగుస—నీకు వాసవి మీద మోజు తీరిందని.''

బాధగా నవ్వాడు.

"మన ప్రజ లెంత భయంకరంగా ఆలోచించగలరు?"

"లోకం తీరే అంత. అస లేం జరిగింది?"

తిలక్ కాసేపు పార్క్‌లో బంతితో ఆడుకునే చిన్న పిల్లలవంక చూస్తూండిపోయాడు. తరవాత చెప్పాడు.

"భార్య అందంగా ఉంటే అదో వరమని ఇంతకాలం నమ్ముతూ వచ్చాను. కాని భార్యలో భర్తకి కావలసింది ఒక్క అందమే కాదు."

ఆగి కొన్ని క్షణాల తరవాత మళ్ళీ చెప్పాడు తిలక్:

"నిజానికి అందం కాదు. అది రాత్రి కొద్ది సేపే ఉపయోగపడుతుంది. కాని మిగతా వేళల్లో అవసరమయ్యే అనేకం వాసవిలో లేవు."

"అర్థం కాలేదు."

"కాదు, ఉదాహరణ లిస్తే కానీ" చెప్పాడు.

నేను మవునంగా ఉండిపోయాను. లేచి మా వైపు పడ్డ బంతిని అందుకుని ఆడుకుంటున్న ఆ చిన్న పిల్లలవైపు విసిరి చెప్పసాగాడు తిలక్.

"పెళ్ళికి ముందు వాసవిలో ఇన్ని లోపాలున్నాయని తెలియదునాకు. అసలు ఆడవాళ్ళలో ఇలాంటి బలహీనతలు ఉంటాయని ఎప్పుడూ వూహించలేదు, మా వంశం లోని ఆడవాళ్ళలో లేవు కాబట్టి. భార్యతో కలిసి రెండున్నర గంటలు సినిమా చూడాలని కోరుకోని మొగుడుంటాడేమో చెప్పు."

"వాసవితో సినిమా చూడాలనుకుంటే ఆ సంగతి ఆ అమ్మాయితో చెప్పొచ్చుగా...రాదా?"

"వస్తుంది. కాని అరగంటచూస్తే తలనొప్పి అంటుంది. ఇంతదాకా మేం ఇద్దరం కలిసి ఒక్క సినిమా పూర్తిగా చూడలేదు. మధ్యలో లేచి వచ్చేస్తాం. ఆ తలనొప్పి మర్నాటి ఉదయందాకా వదలదు."

"డాక్టర్ని చూపించలేదా?"

"వాసవికి వంట రాదు. ఆమె చేత్తో చేసిన వంట ఈ రోజుదాకా కడుపు నిండా తినలేదంటే నమ్ము. మా అమ్మ మీద ఒట్టు.ఛీ..ఛీ...వంటరాని ఆడదంటే అసహ్యం కలిగేలా చేసింది."

"వంట రాదా?"

"ఉహూఁ. ఉల్లిపాయలంటే ఎలర్జీ. వాటిని అసలు వాడదు. నా కవంటే ప్రాణం. బయట తింటే, అమడ దూరం నించే 'ఉల్లిపాయ తిన్నారు కదా? దూరంగా ఉండండి' అంటుంది."

నేనుమవునంగా వింటుండిపోయాను.

"శుభ్రత ఎక్కువ. దగ్గరమేముంటే స్నానం చేసి వస్తుంది. వూటీలో చలికి వణుకుతున్నా సరే స్నానం చేయాలి. దగ్గరయ్యాక మళ్ళీ స్నానం చేసి తీరాలి. ఎప్పుడైనా మెలకువ వస్తే నన్ను లేపి పక్కమీద దుప్పటి దులిపి వేయడం వెధవ అలవాటు. చస్తున్నాను దీని శుభ్రతతో."

"ఐ యామ్ సారీ."

"అప్పుడే సారీ కాదు. ఇంకా ఉంది." ఆగి గొంతు తగ్గించి చెప్పాడు. ఒకో అక్షరంలోంచి అతను ఇంతకాలం మనసులో తాళం వేసి దాచుకున్న బాధలంతా బయటపడసాగింది.


"ఐ కాన్ట్ ఈవెన్ కిస్ హర్ ప్రాపర్లీ. 'ఏమిటూ వెధవ పని! ఎంగిలి' అంటుంది. వూపిరి ఆగిపోతుందనే మానసికజాడ్యం ఉంది. ఇరవై నాలుగ్గంటలూ ఫాన్ తిరగాలి. లిఫ్ట్‌లోకి ఎక్కదు. ఏమిటంటే 'వూపిరి ఆగి పోతుంది' అంటుంది. ఇఫ్ ఐ ఎంబ్రేస్ హర్... వూపిరి ఆగిపోయినట్టు ఫీలయి స్పృహ తప్పిపోతుంది. మనలాగ వూపిరి పీల్చి వదలడం అసంకల్పిత ప్రతీకార చర్యలా కాదు. గుర్తు పెట్టుకుని ఆ పని చేస్తుందనిపిస్తుంది ఒకో సారి."

"హౌ టెరిబుల్!"

"చీకటి పడితే ఇంట్లో ఒంటరిగా ఉండాలంటే భయం. ఎక్కడున్నా నేను వచ్చి తీరాలి. సరదాగా ఫ్రెండ్స్‌తో ఫస్ట్ షోకి వెళ్ళి ఆలస్యంగా వస్తే గుమ్మంలో కూర్చుని ఉంటుంది, ఇల్లంతా లైట్లు వేసి. రాత్రి లైటు లేందే నిద్రపోదు. నాకు లైటుంటే నిద్రరాదు. నేనే ఎడ్జస్ట్ అవాలి ప్రతి దానికి. తను ఎడ్జస్ట్ కాలేదు—ఒక్క విషయంలో కూడా."

మళ్ళీ పిల్లల బంతి మా వైపు వస్తే దాన్ని వాళ్ళ వైపు విసిరి చెప్పాడు తిలక్:

"బస్సు, ఆటో—ఏదిఎక్కినా రెండు నిమిషాల్లో వామిటింగ్స్. రైలు, రిక్షా తప్ప పెట్రోల్‌తో నడిచే ఏ వాహనం ఎక్కినా వామిట్ చేసుకుంటుంటే ఈ సిటీలో ఎలా ఒక చోట నించి ఒకచోటికి వెళ్ళాలంటే? స్కూటర్‌మీద భార్యతో సరదాగా సినిమాకి వెళ్ళాలనే నా కోరిక ఈ జన్మకి తీరదు. దీనికోసం స్కూటర్‌ని కూడా సరిగ్గా వాడటం లేదు. ఐస్‌క్రీం తింటే వారం రోజులు వదలని జలుబు. ఎ. సి. హోటల్‌కో, సినిమాకో వెళ్తే జలుబు. జీవితంలో ముప్పాతిక భాగం జలుబుతోనే సరిపోతుంది వాసవికి."




నేను మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయాను.

"ఇంకా ఇలా చాలావాటి నేకరువు పెట్టడం నా అభిమతం కాదు. ఇప్పుడు చెప్పు, ఇందాక చెప్పిన 'ఐయామ్ సారీ!'" బాధగా చెప్పాడు తిలక్.

"ఇప్పుడు అర్థమైంది." చెప్పాను.

"కొన్ని సమస్యలు కొద్ది కాలంలో పరిష్కరించేయొచ్చు,వంటలాంటివి. కొన్ని జీవితాంతం భరించాలి. బస్సుప్రయాణం శుభ్రత, వూపిరి లాంటివి. నా కర్మ. నా కర్మ. అందమైన భార్య కావాలనుకున్నందుకు ఆ దేముడు బలే శాస్తి చేశాడు."

ఆ పిల్లలతో తనూ బంతాట ఆడటానికి లేచాడు తిలక్.

నేను నిశ్శబ్దంగా వాళ్ళ ఆటని చూస్తుండిపోయాను.

హిందువుగా పుట్టిన ప్రతి వ్యక్తిలో నరనరాల్లో జీర్ణించుకు పోయిన ఫిలాసఫీ 'తలచేవి జరగవు. జరిగేవి కోరవు' లో ఎంతో నిజం ఉందనిపించింది.

అంతేకాదు.

ఆ పిల్లలతో కేరింతాలు కొడుతూ, వాళ్ళలా గెంతుతూ సరదాగా బంతి ఆడే తిలక్‌ని చూస్తే ఆ క్షణంలో నా కనిపించింది—చక్కటి లైఫ్ పార్ట్‌నర్ దొరకటం, కేవలం అదృష్టం అనే అదృశ్యమయిన శక్తితో ముడిపెట్టబడి ఉంటుందని. ★

